ఆరుముల్ల రాజుకు బెస్ట్ లీడర్‌షిప్ అవార్డు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18:శ్రీరాంపూర్ కాలనీకి చెందిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఐపీపీ జేసీ డాక్టర్ ఆర్ముల్ల రాజును బూస లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ బెస్ట్ లిడర్‌షిప్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ బూస ప్రదీప్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ దేవి లక్ష్మి ప్రకటించారు. వృత్తి శిక్షణ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

జన్నారం మండల వాసులకు అవార్డులు..

జన్నారం, ఏప్రిల్ 18 :మండలంలోని ఆదర్శ ఫౌండేషన్, ఆదర్శ కళాసమితి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణించిన పలువురికి ఆదర్శ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ అంబేద్కర్ వాదిగా సిటిమల భరత్‌కుమార్, ఉత్తమ ఉపాధ్యాయుడు బొమ్మ రాంరెడ్డి(రిటైర్డ్), ఉత్తమ యువజన సంఘం జై హనుమాన్ గుర్రం శిరీష, ఫొటోగ్రాఫర్, బీ అంజన్‌కుమార్, విజయ, సాయిరాజ్, ఉమాదేవి, శ్రావణిని నిర్వాహకులు లింగంపెల్లి రాజలింగం, ఆకుల నరేశ్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఫార్మసీ విభాగంలో డాక్టరేట్

జన్నారం, ఏప్రిల్ 18 : మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీలోని అక్కపెల్లిగూడకు చెందిన జాడి రాజేంద్రకుమార్ ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నికల్ ప్రొఫెసర్ ఎస్ శ్రీను నాయక్ పర్యవేక్షణలో ఫార్ములేషన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ గ్యాస్ట్రోరిటెంటివ్ డ్రగ్ డెలివరీ సిస్టంపై పరిశోధించి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. రాజేందర్ కుమార్‌ను కుటుంబసభ్యులు, మిత్రులు అభినందించారు.

బీమా చెక్కు అందజేత

కౌటాల, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని టీజీబీ బ్యాంకులో గురుడుపేట గ్రామానికి చెందిన ఆలం మీరాబాయి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా కలిగి ఉండి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం ఆమె కుమారుడు సురేశ్‌కు బీమా కింద మంజూరైన రూ. 2లక్షల చెక్కును తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నర్సింహ స్వామి అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్, అకౌంటెంట్ రాజేశ్, క్యాషియర్లు గోపి, భాస్కర్, బ్యాంకు మిత్ర నీరజ, సీఎస్పీ మోరేశ్వర్ పాల్గొన్నారు.

సైన్స్ శిక్షణ శిబిరం

నస్పూర్, ఏప్రిల్ 18 : ఈ నెల 26వ తేదీ నుంచి 15 రోజుల పాటు జిల్లా సైన్స్ కేంద్రంలో వేసవి సైన్స్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మొత్తం 100 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి మధుబాబు 9849550200లో సంప్రదించాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 18: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సింగాపూర్ పునరావాసకాలనీలో వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బుడి అరుణ్‌శర్మ, బండారి సుధాకర్, పెరుమాళ్ల జనార్దన్, తోట కిష్టయ్య, అగ్గు మల్లేశ్, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాయితీ కల్పించాలి

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 18: జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ అంబులెన్స్, వైకుంఠ రథం వాహనాలకు రాయితీలను కల్పించాలని ఇన్‌చార్జి ఆర్టీవో సంతోష్‌కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు వీ మధుసూదన్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా శాఖ కోశాధికారి సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రక్తదాన శిబిరాలను నిర్వహించాలని కోరారు.

బస్ స్టాప్‌లను ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఏప్రిల్ 18 : జిల్లాలోని గోలేటి నుంచి గోయగం వరకు నిర్మించిన నాలుగు వరుసల రహదారి పూర్తయినప్పటికీ బస్ స్టాప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్ అన్నారు. గురువారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ వివిధ ప్రజా సంఘాల నాయకులు దుర్గం దినకర్, మాలశ్రీ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన సహాయక పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణుతో కలిసి సిర్పూర్, ఆసిఫాబాద్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులతో పాటు వయోవృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు రాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు జాబితాపై పోలింగ్ కేంద్రం వివరాలు, చిరునామా సరి చూసుకోవాలని, ఏమైనా తప్పులు ఉన్నట్లయితే వెంటనే సరి చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓఆర్ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని, సెక్టార్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారి సురేశ్, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ : మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే

తాండూర్ : ఓటర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

లోకసభ ఎన్నిక నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్, ఆసిఫాబాద్ శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.ఈ నెల 25వ తేదీ వరకు (ప్రభుత్వ సెలవు రోజులు మినహాయించి) ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆదిలాబాద్ లోని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్, సహాయ రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించవచ్చని, నామినేషన్ ఫారాలను నిర్దేశిత పని వేళలయందు పొందవచ్చని తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 11 గంటల నుంచి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్ నందు నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, అభ్యర్థిత్వము ఉపసంహరించుకొను నోటీసును అభ్యర్థి స్వయంగా, ప్రతిపాదకులచే, ఎన్నికల ఏజెంట్ కాని అభ్యర్థి చేత రాత పూర్వకముగా ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా అందజేయవచ్చని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని పనులు పూర్తి చేయాలి
-అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కాగజ్‌గర్ రాజస్వ మండల అధికారి కాసబోయిన సురేశ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి తహసీల్దార్లు, ఇంజినీరింగ్ విభాగం, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఉన్నందున కల్పించాల్సిన వసతులపై యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి మే 10వ తేదీలోగా పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. 13వ తేదీన జరగనున్న లోక్ సభ ఎన్నికల పోలింగ్ కార్యక్రమం సందర్భంగా ప్రజలకు, పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకులను కలిసిన కలెక్టర్

నస్పూర్, ఏప్రిల్ 18 : ఎన్నికల నేపథ్యం లో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల ఖర్చుల పరిశీలకులుగా నియమితులైన సమీర్ నైరంతర్యను గురువారం పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీలో జ్యోతి అతిథి గృహానికి రాగా కలెక్టర్ బదావత్ సంతోష్ మర్యాద పూర్వకంగా కలిశారు.

అన్ని సౌకర్యాలతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్

తాండూర్, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల కోసం ఓటర్లు, సిబ్బందికి అన్ని సౌకర్యాలతో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బీ రాహుల్ అన్నారు. గురువారం తాండూర్ మండల పరిధిలో ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న పోలింగ్ కేంద్రాల మార్పు ప్రక్రియను పరిశీలించారు. మే 13న లోక్ సభ ఎన్నికల్లో ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో పీ శ్రీనివాస్, గిర్దావార్ అంజన్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల

హాజీపూర్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్‌ను మంచిర్యాల పార్లమెంట్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ డివిజనల్ (ఆర్డీవో) కార్యాలయంలో నోటీస్ బోర్డులో అంటించారు. ఈ కార్యక్రమంలో వడాల రాములు, ఎన్నికల డీటీ గడియారం శ్రీహరితో పాటు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి మండలంలో..

కోటపల్లి, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నోటీస్ బోర్డుపై అంటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనూ అంటించాలని ఎంపీడీవో ఆకుల భూమయ్య ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ఏపీవో బాలయ్య తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు సమకూర్చాలి

భీమారం, ఏప్రిల్ 18 :భీమారంలో మండల పరిషత్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటిస్‌బోర్డులో చెన్నూర్ రిటర్నింగ్ అధికారి డీ చంద్రకళ అతికించారు. అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. జడ్పీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎంపీడీవో రాధ రాథోడ్, ఎంపీవో సతీశ్‌రెడ్డి పలు సూచనలు చేశారు.

చెన్నూర్ పట్టణంలో..

చెన్నూర్ టౌన్, ఏప్రిల్ 18 : చెన్నూర్‌లోని తహసీల్ కార్యాలయంలో నోటిస్‌బోర్డుపై నోటిఫికేషన్‌ను అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ డీ.చంద్రకళ ఏర్పాటు చేయించారు. పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- ఏసీపీ వెంకటేశ్వర్ • డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 18 : విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జైపూర్ డివిజన్ ఏసీపీ ఏ.వెంకటేశ్వర్ సూచించారు. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై గురువారం కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ సీఐ కే.రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చెన్నూర్ తహసీల్దార్, విద్యార్థులు, తదితరులున్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

- ఆసిఫాబాద్ అగ్నిమాపక శాఖాధికారి రాజేందర్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఏప్రిల్ 18: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆసిఫాబాద్ అగ్నిమాపక శాఖాధికారి రాజేందర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాం వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాద నివారణ సామగ్రి ప్రతి పెట్రోల్ బంక్, గ్యాస్ గోదాంలో తప్పనిసరిగా వాడకంలో ఉంచాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది సంపత్, సతీశ్ పాల్గొన్నారు.

గ్యాస్ గోదాంలో సూచనలు చేస్తున్న రాజేందర్

కోటపల్లి : అవగాహన కల్పిస్తున్న సురేశ్ కుమార్

కోటపల్లి మండలంలో..

కోటపల్లి, ఏప్రిల్ 18 : తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోటపల్లి మండలంలోని సర్వాయిపేటలో గురువారం అగ్ని ప్రమాదాల నివారణ పై స్థానికులకు మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ జీ సురేశ్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వాచర్ ఓదెలు తదితరులున్నారు

మమత ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రంలో తాగునీటిని అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 18: మంచిర్యాల మహిళా తరంగిణి (మమత) ఆధ్వర్యంలో పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య ప్రారంభించారు. తాగునీటితో పాటు పెరుగన్నం, మజ్జిగను పంపిణీ చేయడంపై మమత సభ్యులను మున్సిపల్ చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ ముఖేశ్‌గౌడ్, మమత అధ్యక్షురాలు మంజులాకృష్ణారావు, కార్యదర్శి ఇరుకుల్ల లత, కోశాధికారి వందనపు నాగమణి, సభ్యులు జ్యోత్స్న చంద్రదత్, గోపగారి శ్రీదేవి, ఆర్ భాగ్యలక్ష్మి, పద్మ, ఎం శృతి, సముద్రాల రమ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పరిశీలన


విద్యుత్ పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

తాండూర్, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని కొత్త గుడిసెలు కాలనీలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను తాండూర్ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో పీ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం కొత్త గుడిసెలు కాలనీలో ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీ కొనడంతో విద్యుత్ స్తంభం విరిగి వైర్లు తెగిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో విద్యుత్ సిబ్బందితో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. వాటర్ ట్యాంకర్ ద్వారా సిబ్బందితో ఇంటింటికీ నీటిని సరఫరా చేయించారు. పంచాయతీ కార్యదర్శి తపాస్‌కుమార్, విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, లైన్‌మెన్‌లు గిరిబాబు, నరేశ్, గ్రామ పంచాయతీ, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

కాసిపేట మండల సర్వసభ్య సమావేశం

కాసిపేట, ఏప్రిల్ 18 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రొడ్డ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. అభివృద్ధి పనులపై చర్చించారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు ప్రగతి నివేదికను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, మేరుగు పద్మ, చంద్రమౌళి, కోఆప్షన్ సిరాజ్‌ఖాన్, ఎంపీవో నాగరాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

నెన్నెల,ఏప్రిల్18: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇందూరి రమేశ్ అధికారులను కోరారు. గతేడాది ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యాన్ని విక్రయించారని తెలిపారు. వరి కోతలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడం, మరో వైపు వర్ష సూచన ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

హాజీపూర్, ఏప్రిల్ 18 : మండలంలోని బుద్ధిపల్లికి చెందిన ముడిమడుగుల పోసు (68) జీవితంపై విరక్తితో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు హాజీపూర్ ఎస్ఐ సురేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పోసు మూడేండ్ల నుంచి అస్తమా వ్యాధికి చికిత్స తీసుకున్నా నయం కాలేదు. బుధవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారన్నారు. పెద్ద కుమారుడు ముడిమడుగుల మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాపు నడుపుతున్న ఒకరిపై కేసు

బెజ్జూర్, ఏప్రిల్ 18 : మర్తిడి గ్రామానికి చెందిన చిలువేరు శ్రీనివాస్ అనుమతిలేని వడ్డీ వ్యాపారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే సమాచారంతో కౌటాల సీఐ సాదిక్ పాషా, బెజ్జూర్ ఎస్ఐ విక్రమ్‌తో కలిసి గురువారం శ్రీనివాస్ ఇంట్లో సోదాలు చేశారు. శ్రీనివాస్ వద్ద వడ్డీ వ్యాపారానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐ తెలిపారు. ఆయన ఫర్టిలైజర్ షాపులో సోదాలు నిర్వహించగా షాపులో ఏమి లభించ లేదని తెలిపారు. అదే విధంగా కిరాణం దుకాణంలో సోదాలు నిర్వహించారు. కానీ కిరాణా దుకాణం ఇటీవల శ్రీనివాస్ తన బంధువు అయిన బుద్ద సందీప్‌కు విక్రయించాడు. షాపులో 13 మద్యం సీసాలు లభించినట్లు పేర్కొన్నారు. కిరాణా షాపు యజమాని సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

కలెక్టరేట్‌లో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు

తాగునీటి ప్లాంటును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఏప్రిల్ 18 :వేసవి నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయానికి వచ్చే ప్రజలు, కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది కోసం తాగునీరు ఏర్పాటు చేశామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఏప్రిల్ 18 : జిల్లాలో ఈ నెల 25 నుంచి మే 2 వరకు జరిగే ఓపెన్ ఇంటర్, 10వ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఈవో యాదయ్య, ఇంటర్మీడియట్ విద్యాధికారి శైలజ, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల కోసం 5, పదో తరగతి పరీక్షల కోసం 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1317 మంది ఇంటర్, 659 మంది 10వ తరగతుల విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

కోటపల్లి, ఏప్రిల్ 18 : గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో ధర్మారాణి సూచించారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లిలో పర్యటించి నీటి సరఫరాపై సూచనలు చేశారు. నీటి ఎద్దడి తీవ్రమైతే వ్యవసాయ బావుల నుంచి నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆకుల భూమయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రినాథ్, పంచాయతీ కార్యదర్శి మద్ది శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కోటపల్లి : మరమ్మతులను పరిశీలిస్తున్న డీఎల్పీవో


జన్నారం : చేతిపంపును పరిశీలిస్తున్న ఎంపీడీవో

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

జన్నారం, ఏప్రిల్ 18 :మండలంలోని కొత్తపేటను ఎంపీడీవో శశికళ సందర్శించారు. గ్రామంలోని తాగునీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీవో రవీందర్, కార్యదర్శి ఉన్నారు.

సమ్మేటివ్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- మంచిర్యాల డీఈవో యాదయ్య


పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఈవో యాదయ్య

మందమర్రి రూరల్, ఏప్రిల్ 18: ఈ నెల ప్రారంభమైన 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు(సమ్మేటివ్ – 2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల డీఈవో యాదయ్య సూచించారు. గురువారం మందమర్రి మండలంలోని ఆదర్శ(మోడల్) స్కూల్‌లో పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డిని పరీక్షల నిర్వహణ తీరును, విద్యార్థుల హాజరును అడిగి తెలుసుకున్నారు.

మహిళలు విద్యతో పాటు ఆర్థికంగా ఎదగాలి.

మందమర్రి, ఏప్రిల్ 18: విద్యతోనే మహిళా వికాసం సాధ్యమని ప్రతి మహిళా చదువుతో పాటు ఆర్థికంగా ఎదగాలని మంచిర్యాల డీఈవో యాదయ్య అన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపతినగర్‌లో వయోజన విద్యా శాఖ, మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆఫ్ సఖి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వయోజన విద్య, కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. శిక్షకులు నేర్చుకుని కుట్టిన దుస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవోను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, డీఆర్పీలు బండ శాంకరి, అశోక్‌రావు, శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్లు ఉప్పులేటి గోపిక, ఉప్పులేటి నరేశ్, ట్రైనర్ ఉప్పులేటి శారద తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి

క్రీడాస్ఫూర్తితో రాణించాలి

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న బెల్లంపల్లి జీఎం రవిప్రసాద్

రెబ్బెన, ఏప్రిల్ 18: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో రాణించి పతకాలు సాధించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడ మైదానంలో గురువారం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమకాంత్, సీఎంవోఏఐ ప్రతినిధి రమేశ్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎంలు ఉజ్వల్‌కుమార్ బెహరా, రామారావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్ వైజర్లు అశోక్, రమేశ్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద, ఫాసిస్ట్ పార్టీ బీజేపీని ఓడించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతో దేశ సంపదను ప్రైవేట్ సంస్థలకు నరేంద్రమోదీ అప్పగించారని ఆరోపించారు. కార్మికులు, రైతుల ఆదాయం పెరగలేదని బీజేపీ నాయకుల ఆస్తులు పెరిగాయన్నారు. దేశంలో ఖనిజ సంపద దోపిడీకి గురవుతుందని పేర్కొన్నారు. మీడియా, న్యాయ వ్యవస్థ, సీబీఐ బీజేపీ చేతిలో పెట్టుకుందని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సంతోష్, శోభ, శంకర్ పాల్గొన్నారు.

21న ఉమ్మడి జిల్లా బాలుర సీనియర్స్ ఫుట్ బాల్ జట్టు ఎంపిక

మందమర్రి రూరల్, ఏప్రిల్ 18: మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ లో ఈ నెల 21న మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర సీనియర్స్ ఫుట్ బాల్ జట్టు ఎంపికపోటీలు నిర్వహిస్తున్నట్లు ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ రెడ్డి తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, మూడు పాస్ పోర్ట్ ఫొటోలు, బర్త్ సర్టిఫికెట్ తీసుకొని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు గాలిపెల్లి సురేందర్, కరుణాకర్‌ను 9849444744, 8519878452 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అడవిని సంరక్షించాలి

వేమనపల్లి బీట్‌లో పర్యటిస్తున్న ఎఫ్‌డీవో విజయ్‌కుమార్

వేమనపల్లి, ఏప్రిల్ 18 : అడవితో పాటు వన్యప్రాణులను రక్షించడానికి విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని బెల్లంపల్లి ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని కుష్నపల్లి రేంజ్ పరిధిలోని వేమనపల్లి, కొత్తపల్లి బీట్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణులకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. వాటి దాహన్ని తీర్చడానికి కుంటల్లో ఎప్పుడు నీరుండేలా చూడాలన్నారు. అడవికి నిప్పు అంటుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ లక్ష్మీనారాయణ, ఎఫ్ఎస్‌వో శ్రీలత, ప్రణయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలాం ఝరిలో భురిదేవుని వేడుకలు


భురిపేన్ వద్ద పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

కెరమెరి, ఏప్రిల్ 18: కొలాంఝరి గ్రామంలో ఆదివాసీలు సామూహికంగా తమ ఆరాధ్య దేవత భురిపేన్ వేడుకలను సంప్రదాయంగా జరుపుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొలాం తెగలో ఈ వేడుకను హోలీ తరహాలో పసుపు రంగు పోస్తూ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం సంప్రదాయ వాయిద్యాలపై మహిళలు చేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. పూజారి సిడాం పగ్గు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామపటేల్ దేవ్‌రావ్, నిర్వాహకులు సిడాం కట్టి, ముత్తు, భీంరావ్, దేవ్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి వాహనం తనిఖీ చేస్తాం



చెక్‌పోస్టు వద్ద పరిశీలిస్తున్న ఎస్ఐ రాజు

దహెగాం, ఏప్రిల్ 18: చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తామని ఎస్ఐ రాజు తెలిపారు. గురువారం సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినందున మండలంలోని కల్వాడ వద్ద చెక్ పోస్టును పునఃప్రారంభించామన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేల వరకు తీసుకెళ్లవచ్చన్నారు. అంతకంటే ఎక్కువగా తీసుకోపోవాల్సి వస్తే సరైన ఆధారాలు ఉం డాలన్నారు.